# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 06-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **హంద్రీనీవా ప్రధాన కాల్వ ద్వారా ఈ నెల 15వ తేదీన నీరు విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి తొలి దశ నిర్మాణం రాబోయే మూడేళ్లలో పూర్తవుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

**3.** **వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగులు రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

**4.** **పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.**

**5.** **ఈరోజు ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**

==========================

హంద్రీనీవా ప్రధాన కాల్వ ద్వారా అనంతపురం జిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఈ నెల 15వ తేదీన నీరు విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండవ దశ పనులు పూర్తి చేసి ఈ నెలాఖరుకు పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా జలాలు అందించాలని, ఈ మేరకు కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిన్న ఆయన జలవనరుల శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ ఏడాది నీటి ప్రవాహాలు ఆశాజనకంగా ఉన్నాయని అత్యుత్తమ నీటి నిర్వహణ ద్వారా ప్రతి చుక్కా సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి తొలి దశ నిర్మాణం రాబోయే మూడేళ్లలో పూర్తవుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్న జరిగిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ.. సీఆర్‌డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ పాత్రికేయులకు వివరించారు. అమరావతి రెండో దశ నిర్మాణానికి 13 గ్రామాల పరిధిలో 20 వేల 494 ఎకరాల భూసమీకరణ ప్రతిపాదనను ఆమోదించామని

మంత్రి తెలియజేస్తూ..

...వాయిస్ ... 35 సెకన్లు

-----------------------------

వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పని వేళల పరిమితిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో పని వేళలు 48 గంటలు మించరాదని స్పష్టం చేసింది. పరిమితి దాటితే అదనపు సమయానికి వేతనం చెల్లించాలని స్పష్టంచేసింది. రోజులో 6 గంటల్లో కనీసం అరగంట విశ్రాంతి ఇవ్వాలని, విశ్రాంతితో కలిపి 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలు సవరించామని ప్రభుత్వం వెల్లడించింది.

-----------------------------

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర-పీ4' కార్యక్రమంపై సమీక్ష అనంతరం నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. స్వర్ణాంధ్ర-పీ4 కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు భరోసా లభిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలు, లక్ష మంది మార్గదర్శులను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి భరత్ వివరిస్తూ..

..వాయిస్.. 27 సెకన్లు

-----------------------------

ఈరోజు ప్రపంచ జునోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. జంతువులు ప్రత్యేకించి పెంపుడు జంతువుల నుండి మానవులకు వ్యాపించే వ్యాధులు, వాటి నివారణ పట్ల అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం జరుగుతోంది. లూయీ పాశ్చర్ అనే ఫ్రెంచ్ జీవ శాస్త్రవేత్త శునకాల నుండి రేబిస్ వ్యాధి వస్తుందని గుర్తించి... ఆ వ్యాధిని అరికట్టడానికి 1886వ సంవత్సరం జులై 6వ తేదీన టీకా కనుగొన్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని జూలై 6వ తేదీని జునోసిస్ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేస్తామని ప్రకటించింది. ఇందుకోసం 5 లక్షల 37 వేల యాంటీ రేబిస్ టీకాలను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు.

-----------------------------

ద్విచక్ర వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాసిరకం హెల్మెట్ల తయారీ, వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఐఎస్ఐ మార్కు, బీఐఎస్ ధ్రువీకరణ ఉన్న హెల్మెట్లను మాత్రమే వినియోగించాలని, ఈ మేరకు తనిఖీలు నిర్వహించాలని, వినియోగదారులకు అవగాహన కల్పించాలని దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాసింది. ఈ విషయాన్ని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిన్న ప్రకటనలో వెల్లడించింది.

-----------------------------

ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసులు, పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ జయంతి ఈరోజు. తెలుగు సంగీత ప్రపంచంలో మేరునగధీర సమానులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ 1930 జూలై 6న ఆంధ్రప్రదేశ్‌లోని అప్పటి తూర్పు గోదావరి జిల్లా రాజోలు  శంకరగుప్తంలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో తనకు తానే సాటి అనిపించుకున్న బాలమురళీకృష్ణ సొంతగా కొన్ని రాగాలను ఆవిష్కరించారు. ప్రపంచ వ్యాప్తంగా 26 వేల సంగీత కచేరీలను నిర్వహించిన ఘనత ఆయనకు దక్కింది. ఆకాశవాణిలో నిలయ విద్వాంసులుగా చిరకాలం ఆయన సేవలు అందించారు. భక్త రామదాసు కీర్తనల ప్రచారానికి ఆయన విశేష కృషి చేశారు. తన గానమాధుర్యంతో అలరించిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ 2016 నవంబర్ 22న తుదిశ్వాస విడిచారు. ఆ బాలగోపాలాన్ని అలరించిన బాలమురళి గళాన్ని ఒకసారి విందాం.

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ పరిపాలనా అధికారుల నియామకాన్ని చేపట్టామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో హైదరాబాద్‌లో నిన్న ఆయన సమావేశమయ్యారు. వీఆర్వో, వీఆర్ఏలుగా పని చేసినవారికి జీపీవోలుగా అవకాశం ఇస్తున్నామని చెప్పారు. ప్రత్యేక పరీక్ష ద్వారా 3 వేల 454 మంది అర్హత సాధించారని వెల్లడించారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు వీఆర్వో, వీఆర్ఏలకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించామని.. అర్హత పరీక్ష త్వరలోనే నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ భారత బ్యాట్స్‌మెన్ రాణించారు. ఒక వికెట్ నష్టానికి 64 పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్‌లో నాలుగో రోజు ఆటను ఆరంభించిన భారత్ 6 వికెట్ల నష్టానికి 427 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఈ క్రమంలో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 180 కలుపుకొని 608 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ముందు ఉంచింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

మరోవైపు.. తెలంగాణలోనూ ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

======================